# చివరకి 'మిగిలేది'

## -డా. పేరాల శ్రవణ్‌కుమార్

డా.ఆనంద్ గవర్నమెంట్ సర్వీస్ ఆ హాస్పిటల్‌లోనే ప్రారంభం. ఈమధ్యనే పాత పెంకుటింటి స్థానంలో అధునాతనంగా నిర్మించబడి విశాలమైన వార్డులతో, మొజాయిక్ ఫ్లోరింగ్‌తో అలరారుతోంది. అయినా పేదల ఆస్పత్రి అనడానికి గుర్తుగా గోడలమీద అక్కడక్కడ మరకలూ, చారికలూ, బిల్డింగ్ ఎంట్రెన్స్‌లో ముచ్చటగా లాన్, చుట్టూ క్రోటన్స్. కొత్తగా ఉద్యోగంలో జాయినయిన డా.ఆనంద్‌కి ఇంకా స్టాఫ్ అంతా పూర్తిగా పరిచయం కాలేదు.

"సార్! ఓ రెండు పిచికల పిట్నీస్‌లున్నాయి. సంతకాలెట్టాలి తవరూ" కాస్త డిమాండింగ్‌గా అన్నాడు ధోబీ శివుడు.

నల్లటి మానులాంటి దేహం, ఇస్త్రీ చేసిన తెల్లబట్టలూ, ముఖాన కుంకం బొట్టూ, ఈ ఉద్యోగం ఎక్కడికీ పోదన్న ధీమా కనబడుతోంది అతని కళ్లల్లో.

"అదేమైనా పిచికలూ గట్రా తింటే వచ్చే రోగమా?" ఆనంద్ తన ఎనిమిదేళ్ల ఎంబిబియస్ ప్లస్ ఎమ్ఎస్‌లో ఎప్పుడూ అలాంటి వ్యాధి పేరు వినలేదు.

నువ్వసలు డాక్టర్‌వేనా? అన్నట్టు ఎగాదిగా చూసాడు శివుడు.

"పిచికల పిట్నీసంటే తెలీదంటే ఎట్టా? ఇదిగో సార్ పారం"

ఫారం చూసి పగలబడి నవ్వాడు డా.ఆనంద్.

"ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌కొచ్చిన తిప్పలా? సరి మరి కాండేట్ ఏడి?" నవ్వాపుకుంటూ అడిగాడు.

"కేండీటా? కేండీటెందుకు?" అర్థం కాక అడిగాడు శివుడు.

"ఎందుకేంటోయ్! క్యాండేట్‌ని ఎగ్జామిన్ చేసి కదా సర్టిఫై చేస్తాం అతను ఫిట్ అని"

"అన్నీ సూసి సంతకం ఎడ్తే ఇక డబ్బులెందుకండీ ఇవ్వడం. డబ్బులిత్తారంటన్నానుగదా. పెద్ద డాక్టరుగారైతే ఇయ్యేం అడగరు. అనుభవం గదా! ఏలి ముద్దర్లెక్కన ఎన్నేనా ఎట్టేత్తారు సంతకాలు, లెక్క తేడా రాకూడదుగానీ" గొణుక్కుంటూ ఫారాలు తీసుకుని వెళ్లిపోయాడు శివుడు.

"సిస్టర్...సిస్టర్" వార్డ్‌లో కూర్చుని పుట్టబోయే తన బాబుకి స్వెట్టర్ అల్లుకుంటున్న సిస్టర్ ప్రమీల దిగ్గున సర్దుకుని లేచింది కొత్త డాక్టర్‌ని చూసి.

"రండి...రౌండ్స్ వేద్దాం" వార్డులోకి నడుస్తూ అన్నాడు డా.ఆనంద్.

ఎందుకో ఇబ్బందిగా దిక్కులు చూస్తోందామె. అంతలో ఎక్కడ్నుంచో ఊడిపడ్డాడు శివుడు.

"పెద్దసారొచ్చి ఎత్తార్లెండి రౌండ్సు. మీకొత్త కదా" తాపీగా అన్నాడు.

"అసలు నీ డ్యూటీ ఏంటి శివుడూ" కోపాన్ని తమాయించుకుని అడిగాడు ఆనంద్.

"ధోబీ అండి సార్"

"అంటే...బట్టలుతికే పని అంతేనా?"

"ఇక్కడ ఉతకాల్సిన బట్టలన్నీ ఇంటి దగ్గరకెళ్లి మాయావిడ సేతే ఉతికిత్తానండి. మనదంతా ఇక్కడ ఎడిమినిస్టేషనే" గారపళ్లికిలిస్తూ అన్నాడు శివుడు.

"ఓహో... నీ పని కూడా మీ ఆవిడ మీదే వేసేస్తావన్నమాట. సుఖజీవివోయ్" చురకేసాడు ఆనంద్.

"అబ్బే కట్టజీవినేలెండి" జేబులో బీడీల కట్ట తడుముకుంటూ నవ్వాడు శివుడు ముందు ముందు నా తడాఖా మీకే తెలుస్తుందన్నట్లు.

★ ★ ★

ఆ హాస్పిటల్‌లో అంతా శివుడిదే పెత్తనం. అతనికి తెలియకుండా ఏ పనీ జరగడానికి వీల్లేదు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.ధనమూలంకి కుడిభుజం శివుడు. ఎంట్రెన్స్ దగ్గర కారాగిన చప్పుడుతో స్టాఫంతా అలెర్టయ్యారు. లూజుగా వున్న తెల్ల గ్లాస్కో షర్ట్‌లోంచి తన్నుకొస్తున్న బొజ్జ, బ్లాక్ ప్యాంట్, నల్లరంగుతో వెల్లవేసినా కుదుళ్ల దగ్గర గుట్టు రట్టు చేస్తున్న తెల్ల జుట్టు...భారంగా కారు దిగాడు డా.ధనమూలం.

"ఏం శివుడూ ఎలా వుంది మన ఆస్పత్రి" హుందాగా నడుస్తూ అడిగాడు.

అంతా నా సొంతమే అన్న అహం వుందా స్వరంలో.

"మనాస్పత్రికేమండి. ఫైవ్‌స్టార్ హోటెల్లా వుంటేనూ" సోప్ వేసాడు శివుడు.

ఎంతైనా ధోబీకదా.

"గుడ్‌మార్నింగ్ సర్. ఐయామ్ డా.ఆనంద్" వినయంగా విష్ చేసాడు ఆనంద్.

దుర్భేద్యమైన తన కోటలోకి శత్రువు ప్రవేశించినట్లు కాస్త భయంగా కాస్త కోపంగా వుంది డా.ధనమూలంకి ఆనంద్‌ని చూస్తే.

దాదాపు పదేళ్ళుగా ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉన్నాడు డా.ధనమూలం. పుట్టిన ఊరు, అత్తారి ఊరూ అదే. ఎమ్మెల్యేగారు కూడా అస్మదీయుడే. కావాల్సినంత పలుకుబడీ, అక్కర్లేనంత అక్రమ సంపాదనా. తనకన్నా ఎక్కువ క్వాలిఫికేషన్‌తో ఇక్కడ ఉద్యోగంలో చేరిన డా.ఆనంద్ తన ఆదాయానికి ఎక్కడ గండి కొడతాడో, ఎక్కడ మంచి పేరు కొట్టేస్తాడోనన్న ఇన్‌సెక్యూరిటీ పీడిస్తోంది నిన్నటినుంచీ.

"సో...యూ ఆర్ డా.ఆనంద్. ఇది చాలా పొలిటికల్ ప్లేస్. జాగ్రత్తగా ఉండాలి. మెడికల్ కాలేజీలోలా ఉంటే కుదర్దు. ఫాలో మై రౌండ్స్" సీరియస్‌గా అనేసి ముందుకు సాగాడు రౌండ్స్‌కి.

"ఇందాకే కదండీ అడ్మిషనయ్యారు కొత్త డాక్టర్‌బాబు. ఇక్కడి పద్ధతులేవీ తెలీక కనిఫీజయిపోతన్నారు పాపం" ఎగతాళీ, సింపతీ కలిపిన గొంతుతో ఇకిలించాడు శివుడు.

బెడ్ నెంబర్ వన్‌లో అల్సర్ పేషెంట్.

"సార్! వెళ్లిపోకండి. ఒక్కసారి నన్ను పరీక్ష చేయండి. కడుపులో ఒకటే మంట" అర్థించాడు.

"మా సారుకీ అలాగే ఉండాది నిన్ను సూత్తే. కినిక్‌లో కలవమని ఇప్పటికి నూరుసార్లు నూరిపోసినా ఎళ్లి కల్చిన పాపాన బోయేవా" శివయ్య సీక్రెట్‌గా అరిచాడు ఆ పేషెంట్‌ని.

సార్ ఇన్నాళ్లూ తనని పట్టించుకోకపోవడానికి కారణం అర్థమై ఆ సాయంత్రం సార్‌ని క్లినిక్‌లో కలవాలని డిసైడైపోయాడు ఆ పేషెంట్.

రెండో బెడ్ దగ్గరాగాడు ధనమూలం.

"పైల్స్ కేసు డాక్టర్" ఏదో చెప్తోంది సిస్టర్ ప్రమీల.

"ఐనో...ఐనో. రేపు సర్జరీ చేయాలి. ఏం శివుడూ చేద్దామా" శివుడేదో పెద్ద సర్జన్ అన్నట్టు అడిగాడు డా.ధనమూలం.

శివుడు పర్మిషన్ ఇస్తున్నట్లు తలూపేడు.

తాపీగా కదిలాడు ధనమూలం.

ఆరో బెడ్‌మీద "గోరు చిట్లిందని గోట్నించి

గోసీ దాకా సిమెంటుకట్టు ఏసీశేం గదా. ఆయన గోరేనండి ఈయనగోరు'' ధనమూలం చెవిలో ఊదాడు శివుడు.

"బ్యాండేజ్ తీసీవొచ్చా ఇవేళ'' శివుడికేసి చూస్తూ అడిగేడు ధనమూలం.

"తీసేండి. 'ఫరవాలేదు' ఆర్థోపెడిక్ సర్జన్లా అన్నాడు శివుడు.

గోరు విరిగితే అంత పెద్ద బ్యాండేజ్ ఎందుకో, అది తియ్యడానికి ఈ ధోబీని అడగడం ఏంటో, ఇతగాడు ఎస్ అనడం ఏంటో అర్థంకాలేదు ఆనంద్కి. అతని ఫీలింగ్స్‌తో సంబంధం లేనట్లు రౌండ్స్ కొనసాగిస్తున్నాడు ధనమూలం.

"డాక్టర్‌గారూ! ఆపరేషన్ అయి పదిరోజులు దాటింది. కుట్లు తీయరూ'' అడుక్కుతినే వాడిలా ధనమూలం వెంట పడ్తున్నాడు హెర్నియా ఆపరేషన్ అయిన హేమంబరం.

"ఏం చేద్దాం'' అన్నట్లు శివుడికేసి తిరిగి కళ్లెగరేసాడు డా.ధనమూలం.

"ఒద్దు సార్. ఈ బాబు ఇలాగే అంటాడు. కుట్లు తీసీశేరో ఇక మనకి దొరకడు. బొత్తిగా మాట నిలకడలేనోడు'' స్ట్రిక్ట్‌గా 'నో' అనేసాడు శివుడు.



'నువ్వెలా అంటే అలా' అన్నట్లు సాగిపోయాడు తరువాత బెడ్‌కేసి డా.ధనమూలం.

"ఇది హెర్నియా కేసు సర్. ప్రీ ఆపరేటివ్ టెస్టులన్నీ అయిపోయాయి" ప్రమీల చెప్తోంది.

"ఏం శివుడూ! ఇతన్ని రేపు సర్జరీకి పోస్ట్ చేయనా? సౌండ్ పార్టీయేనా?" ధనమూలం ప్రశ్న.

"అంత సౌండేం కాదు సారూ...అప్పుడే వొద్దులెండి ఆప్రేషన్" అనేసాడు శివుడు.


రౌండ్స్ పూర్తయిపోయి ధనమూలం, శివుడు ఏదో సన్నగా మాట్లాడుకుంటూ కనుమరుగవగానే సిస్టర్‌ని పిలిచాడు డా.ఆనంద్.

"సిస్టర్! నాకు పిచ్చెక్కిపోతోంది. అసలీ శివుడి కథేంటి? పేషెంట్‌కి సర్జరీ చేయాలన్నా, కుట్లు తియ్యాలన్నా, కట్టు విప్పాలన్నా వీడ్ని అడుగుతాడేంటి అంత అనుభవమున్న డా.ధనమూలం" అడిగాడు ఆనంద్.



## ఆశాభావం

జస్వంత్ ఆర్ట్స్ బ్యానర్‌పై శ్రీధర్ నిర్మిస్తున్న కొత్తచిత్రంలో శివాజీ సరసన అందాలభామ సింధుతులానీ నటిస్తోంది. ఉదయరాజా ఈ చిత్రానికి కథని సమకూర్చారు. ఏలూరి మల్లిఖార్జున్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. చాలాకాలం తర్వాత వందేమాతరం శ్రీనివాస్ సంగీతాన్ని సమకూరుస్తున్న ఈచిత్రం ఈ నెలలో షూటింగ్ ప్రారంభించుకోనుంది. 'వరుసగా తెలుగులో నటించడం నాకు చాలా హేపీగా ఉంది. ఈ చిత్రం మంచి హిట్ అవుతుందన్న నమ్మకం ఉంది' అంటోంది సింధుతులానీ.




సిస్టర్ నవ్వింది బాధగా.

"శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు డాక్టర్ ఈ హాస్పిటల్‌లో"

"ప్లీజ్ కాస్త వివరంగా చెప్పండి" వేడుకున్నాడు డా.ఆనంద్.

"ఆ ధనమూలంగారికి వీడు బ్రోకర్. పేషెంట్ల దగ్గర ఆపరేషన్‌కి, కట్టు కట్టడానికీ, అడ్మిషన్‌కీ అన్నిటికీ ఫీజులు వసూలు చేసి ధనమూలంగారికి ఇచ్చేది శివుడే. అందులో వీడికీ వాటా వుంటుంది. మొదటే పేషెంట్స్ ఫుల్ అమౌంట్ ఇచ్చారో అన్నీ చక్కగా జరిగిపోతాయి. కొంత బాకీ పెట్టారో వాళ్లనిలా కుట్లు విప్పక, కట్లు విప్పక ఏడిపిస్తుంటారు. ఇద్దరూ ఇద్దరే తోడుదొంగలు. పదేళ్లబట్టీ ఊళ్లో ప్రజలనిలా దోచుకు తింటున్నారు. ఈ హాస్పిటల్‌కు ఎప్పుడు విరగడ అవుతుందో వీళ్ల పీడ" కోపంగా అంది ప్రమీల.

'మైగాడ్! ఇంత దోపిడీనా? ఈ హాస్పిటల్‌కి వచ్చేదే పేదవాళ్లు. వాళ్లకి ఉచితంగా సేవ చేద్దామనే ఉద్దేశ్యంతో అడిగి మరీ తను పుట్టి పెరిగిన ఈ ఊరికి పోస్టింగ్ వేయించుకుని వస్తే ఇక్కడ జరుగుతున్న భాగోతం ఇదా? ఇలాంటి వాళ్లున్నచోట తన ఆశయాలు ఎలా తీరుతాయి?'

ఆ రోజంతా ఇదే ఆలోచన డా.ఆనంద్‌లో. సాయంత్రంవేళలో ఓ డెడ్‌బాడీతో సహా వచ్చాడు కానిస్టేబుల్. డా.ధనమూలంను రిక్వెస్ట్ చేస్తున్నాడు శవం తాలూకు బంధువులు.

"సార్! కారు ఆక్సిడెంట్ కేసు. పోస్టుమార్టం చేయాలి"

"సాయంత్రం ఐదు దాటింది. ఇవాళ చేయడానికి రూల్స్ ఒప్పుకోవు" అన్నాడు ధనమూలం. అది నిజమే. సూర్యుడి వెలుతురు ఉండగానే పోస్టుమార్టమ్ చేయాలి. సూర్యాస్తమయం తరువాత చేయకూడదు.

ఇంతలో శివుడు ప్రత్యక్షమయ్యాడు.

"సారూ...అదేటీ అలా అనేసారు. సౌండ్ పార్టీ సారూ. మనం ఎంతంటే అంతే. పాపం తొందరగా పోస్ట్‌మార్టమ్ చేసేద్దురూ. తరువాత కార్యక్రమాలుంటాయికదా వాళ్లకి" ధనమూలం చెవి కొరికాడు శివుడు.

అంతే...ధనమూలం మూడ్, రూలుతో సహా మారిపోయింది. ఉత్సాహంగా పోస్ట్‌మార్టమ్ కానిచ్చేడు అర్ధగంటలోపే. డాక్టర్‌గారి తరఫున ఘనంగా ఫీజు వసూలు చేసాడు శివుడు. మరో అరగంటలో మరో శవాన్ని పోస్టుమార్టమ్ కోసం తెచ్చారు పోలీసులు.

"ఎవరో పత్తి రైతంట పాపం. అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తినీ..." ఎద్దుల బండి మీద తెచ్చిన బాడీని చూస్తూ వ్యాఖ్యానిస్తున్నారు జనం.

అప్పుడే అటుగా వస్తూ "పార్టీ సౌండేనా?" అలవాటు ప్రకారం అడిగాడు ధనమూలం.

"ఆ..సౌండే. అప్పుల సౌండు, డప్పుల సౌండూ. వింటారా?!" విసుక్కున్నాడు శివుడు 'ఆమాత్రం కామన్‌సెన్స్ లేదా' అన్నట్లు.

"డా.ఆనంద్! ఈ కేసుకి పోస్టుమార్టమ్ మీరు చేయండి. అనుభవం వస్తుంది" అంటూ ఆర్డర్ వేసి చిరాగ్గా వెళ్లిపోయాడు ధనమూలం.

"పాపం పార్టీ సౌండ్ కాకపోతే ఎంత విరక్తో!" బాధగా నవ్వుకున్నాడు ఆనంద్.

పోస్టుమార్టమ్ చేసి ఫ్రెష్‌గా స్నానం చేద్దామని క్వార్టర్స్‌కి వెళ్లాడు ఆనంద్. డా.ధనమూలం క్వార్టర్స్ ప్రక్కనే తన క్వార్టర్స్. విశాలంగా అందంగా వున్న ట్రిబుల్ బెడ్‌రూం క్వార్టర్స్. త్వరలో ఫ్యామిలీని తెచ్చుకోవాలి. అయితే ధనమూలం, శివుడు వ్యవహారం చూస్తుంటే ఇక్కడ పనిచేయాలనే కోరికే చచ్చిపోతోంది. కంచే చేను మేసే చోట తనలాంటి జూనియర్ డాక్టర్ ఆశయాలు ఏ మూలకి? ఈ ఊరి స్వచ్ఛమైన గాలి, నీరు కూడా ధనమూలం లాంటి వారి అవినీతితో కలుషితమైపోయాయనిపిస్తోంది.

రాత్రి పదవుతుండగా సిస్టర్ ఫోన్ చేసింది ఎమర్జెన్సీ కేసని.

"సినిమాకి వెళ్లి వస్తుంటే స్కూటర్‌కి పంది అడ్డు వచ్చింది సార్. దాంతో పట్టుతప్పి పడ్డాను. కాలిమీద స్కూటర్ ఒరిగింది" కాలి గాయం చూపిస్తూ

చెప్పాడు ఆ యువకుడు.

వెంటనే టెక్నీషియన్ రాందాసుని పిలిపించి ఎక్స్‌రే తీయించాడు ఆనంద్.

"ఎక్స్‌రే నార్మల్. ఇదిగో మందులు రాస్తున్నాను'' అంటూ ఏదో చెప్పు న్నాడు ఆనంద్. ఆ యువకుడిలో టెన్షన్ తగ్గింది ఫ్రాక్చర్ లేదనగానే.

"ఏంటండీ నార్మలు? పెద్ద డాక్టరుగారు సూసిసెప్పాలా నార్మలో కాదో. మీకేటి తెలుత్తాది నిన్నగాక మొన్నొచ్చారు. ఇదిగో రాందాసు... బుర్రక్కూడా ఓ ఎక్సరేవుటో తీసీ. పెద్దయ్యగోరు రాగాన్నే అడుగుతారు'' హడావుడిగా మాట్లాడేస్తున్నాడు అప్పుడే ఎంటరైన శివుడు. జేబులోంచి సెల్‌తీసి ధనమూలంకి రింగిచ్చాడు.

'కాలికి దెబ్బ తగిలితే తలకెందుకు మొర్రో' అన్నా యువకుడి మెడలు వంచి బుర్రకి కూడా ఎక్స్‌రే తీయించాడు రాందాసు.

శివుడి పిలుపందుకుని హడావుడిగా వచ్చేసాడు డా.ధనమూలం.

"కాలిబోను ఫ్రాక్చర్. ఆ అదురుకి తల కూడా దెబ్బతింది. కాలికి సిమెంట్ కట్టువేసి నాలుగువారాలుంచాలి. తలకి కూడా బ్యాండేజీ వేయాలి. చెప్ప వోయ్ శివుడూ... బ్యాండేజీలకీ, మందులకీ వాటికీ ఎంతవుతుందో'' ఆ యువకుడి చేతికి వున్న బంగారు ఉంగరాలకేసి ఆబగా చూస్తూ చెప్పుకుపోతున్నాడు డా.ధనమూలం.

"సార్! మీకో నమస్కారం. కొత్త డాక్టర్ గారు చెప్పార్లేండి ఏ ఫ్రాక్చరూ లేదని. మిడిల్‌క్లాస్‌వాడ్ని. నన్ను వదిలేయండి'' నిరసనగా ధనమూలంతో అనేసి డా.ఆనంద్ చేతిని కళ్లకద్దుకుని "థాంక్యూ సార్'' అంటూ హడావుడిగా వెళ్లిపోయాడు ఆ యువకుడు.

మంచి బేరం పోగొట్టారన్నట్టు మిర్రిమిర్రి చూసాడు ధనమూలం డా.ఆనంద్ కేసి, ప్రమీలకేసి. 'అనుభవం లేకపోతే ఇలాగే వుంటుంది' అని సణుక్కుంటూ తన క్వార్టర్స్‌కేసి వెళ్లిపోతున్న ధనమూలాన్ని చూస్తూ నవ్వుకున్నాడు డా.ఆనంద్. మొదలు బాగోని కథలకి ముగింపు బాగోదు. డా.ధనమూలం కథ మొదట్నుంచీ బాగోలేదు.

★ ★ ★

ఆ రోజు ఉదయం. ఎర్రమారుతి కార్లోంచి ఓ పాతికేళ్ల యువకుడ్ని భుజాలమీద మోసుకొచ్చారు ఇద్దరు బలిష్టులు. బహుశా అతగాడి అన్నలయి ఉండవచ్చు. కడుపునొప్పితో మెలికలు తిరిగిపోతున్న అతను స్ట్రెచర్ మీద తిన్నగా పడుకోలేకపోతున్నాడు. రౌండ్స్‌కి వెళ్లబోతున్న డా.ఆనంద్ పేషెంట్ అరుపులు విని ఆదుర్దాగా వచ్చాడు.

"మీరాగండి సారూ! ప్రతి కేసూ చూత్తానంటారు. పెద్దాయనకి తెలిత్తే మమ్మల్ని అరుస్తారు'' సణుక్కుంటూ పెద్దసార్‌కి ఫోన్ చేసాడు అక్కడే తచ్చాడుతున్న శివుడు. 'సౌండ్ పార్టీ' అని వింటూనే ఆఘమేఘాలమీద ప్రత్యక్షమయ్యాడు డా.ధనమూలం.

"డిసీజ్ ఎపెండిసైటిస్. అర్జంటుగా సర్జరీ చేయాలి. శివుడూ! ఆ ఏర్పాట్లేవో చూడు'' మాటల్లో ద్వంద్వార్థం దట్టించాడు డా.ధనమూలం.

"నాకు తెల్దేటి మీరు ఆప్రేసనంటారని? ఐదువేలకి మాటాడేసాను. నాకి య్యరంట. మీ సేతికే ఇత్తారంట. తీసేస్కోండి'' మూడో చెవికి వినబడకుండా ధనమూలం చెవిలో ఉపదేశించాడు శివుడు.

పేషెంట్ బంధువు చేతిలో నోట్లకట్ట బాగా కనబడేలా పట్టుకుని ఉన్నాడు. కీటకాన్ని బల్లి నోట కరుచుకున్నట్లు ఒడుపుగా ఆ నోట్ల కట్ట లాక్కుని జేబులో వేసుకున్నాడు డా.ధనమూలం.

అంతే! ఆ బలిష్టమైన చేతులు పేషెంట్‌ని వదిలి ధనమూలం రెండు చేతుల్నీ రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నాయి. పేషెంట్ చాలా చురుగ్గా స్ట్రెచర్ మీద నుంచి లేచి ఎటెన్షన్‌లో నిలబడ్డాడు. పేషెంట్ పెద్దన్నయ్య తన చొక్కా జేబులోంచి గుర్తింపు కార్డు తీసి ధనమూలంకి చూపిస్తూ అన్నాడు కరుగ్గా "వుయార్ ఫ్రం ఏసీబీ. యు ఆర్ అండర్ అరెస్ట్''

అతను ఏసీబీ సిఐ. పేషెంట్‌గా నటించింది కానిస్టేబుల్.

పోలీస్ వ్యాన్‌లోకి ఎక్కుతూ అక్కడికి అప్పుడే చేరుకున్న ప్రెస్‌వాళ్లకి ముఖం కనబడకుండా దాచుకుంటూ, చుట్టూ చేరిన జనం ఛీత్కారాల్ని అసహనంగా వింటూ అవస్థలు పడుతున్నారు ఆ క్షణంవరకు ఆ హాస్పిటల్‌ని ఏలిన డా.ధనమూలం, శివుడు. హాస్పిటల్ తాళాలు డా.ధనమూలం నుంచి తీసుకుని డా.ఆనంద్ చేతిలో పెట్టాడు ఏసీబీ ఆఫీసర్.

"ఇకనుంచీ ఈ హాస్పిటల్‌కి మీరే ఇన్‌ఛార్జి. ఈ హాస్పిటల్‌కి మంచి పేరు తెచ్చే బాధ్యత మీదే'' అన్నాడు.

డా.ఆనంద్ ముఖం వెలిగిపోతోంది. తన ఆశయాల మేరకి ఆ హాస్పిటల్‌ని తీర్చిదిద్దే అద్భుత అవకాశాన్ని జారవిడుచుకోదల్చుకోలేదు అతను.

'ధర్మ సంస్థాపనార్థాయ...' ఘంటసాల పాడిన శ్లోకం వినబడుతోంది దూరం నుంచి.

★

## స్వర్ణ గడియారం

ప్రపంచంలో అతి ప్రాచీనమైన పూర్తి బంగారంతో తయారు చేయబడిన గడియారం ఒకటుంది. ఈ గడియారం 150 సంవత్సరాలకు ముందు నికాలాయ్‌స్యాడిగన్ అనే వ్యక్తి చేత ఉక్రెయిన్‌లో తయారు చేయబడింది. విశేషం ఏమిటంటే ఇది తయారు చేయబడిన నాటి నుండి ఈనాటివరకూ ఈ గడియారం ఆగకుండా పని చేస్తూనే ఉంది. దీన్ని తయారు చేయడానికి 15 సంవత్సరాలు పట్టింది.

## సముద్ర హంతకులు

సముద్రంలో ఎన్నో జీవరాసులున్నాయి. చిన్నవాటిని పెద్ద జంతువులు తినడం అనాదిగా వస్తున్నదే. లోతైన సముద్రంలో పెద్ద తిమింగలాలు ఉంటాయి. ఇవి ఆ ప్రాంతాల్లో వుండే సీల్ మృగాలను, సముద్రపు జంతువులను లెక్కకు మించి తింటుంటాయి. అందుకనే వీటిని కిల్లర్ వేల్ అంటారు. ఒకసారి ఈ కిల్లర్ వేల్‌ని చంపి చూస్తే దాని కడుపులో సగం జీర్ణమైన సీల్ మృగాలు, సముద్రపు పందులను మనం చూడవచ్చు.

## ది గ్రేట్ వాల్ ఆఫ్ చైనా

ప్రపంచపు వింతల్లో ఒకటైన ది గ్రేట్ వాల్ ఆఫ్ చైనా నిర్మాణానికి మూడులక్షలమంది కార్మికులు పది సంవత్సరాల నిర్విరామ కృషితో ఈ మహా నిర్మాణాన్ని పూర్తి చేసారు.

-పి.వి.రమణకుమార్

